క్లుప్తంగా

అగస్త్యేశ్వరునికి భస్మార్చన



అగస్త్యేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు ప్రదోష కాల సమయంలో పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య, రుద్రాభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, భస్మార్చన నిర్వహించి భస్మహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తిరువెంగళాపురంలో సభ్యుల ప్రచారం

పోరుమామిళ్ల : త్రైత సిద్ధాంత భగవద్గీతే శ్రీకృష్ణుడి నిజమైన బోధని ఇందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు నర్రా శ్రీనివాసరెడ్డి, సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొండుగారిపల్లె, తిరువెంగళాపురం, రాజాసాహేబ్‌పేట గ్రామాల్లో వారు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రచారంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు తిరుపతయ్య, రాజేశ్వరి, నారాయణ, రామకృష్ణ, బాలయ్య, మస్తాన్, రామకృష్ణారెడ్డి, రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వీఆర్‌ఓలను పరామర్శ



వీఆర్‌ఓలను పరామర్శిస్తున్న నల్లిపోగు నాగేశం

అట్లూరు : టీడీపీ మహానాడు ఏర్పాట్లలో విధులు నిర్వర్తిస్తూ గాయపడిన వీఆర్‌ఓలను ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం పరామర్శించారు. కడపలో టీడీపీ మహానాడు కార్యాక్రమాల నిర్వహణకు అట్లూరు మండలం నుంచి వెళ్లిన దొరబాబు, సుబ్బన్న అనే ఇద్దరు వీఆర్‌ఓలు ఫ్లెక్సీలు మీద పడి తీవ్రంగా గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం విధితమే. వీఆర్‌ఓలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వీఆర్‌ఓ దస్తగిరి, శ్రీనివాసులు, బాషా తదితరులు ఉన్నారు.

సీఎస్‌ఐ చర్చికి నూతన కార్యవర్గం

కడప కల్చరల్ : కడప నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా సెంట్రల్ కేటగిరి విభాగంలో పి.మనోహర్‌బాబు, కె.జయవరప్రసాద్, పి.డేనియల్, డి.జాన్, సుకేష్‌లను ఎన్నుకోగా, మహిళా విభాగంలో శ్రావణి, దినకర్, వి.శైలజమ్మ, పి.సౌజన్యలను ఎన్నుకున్నారు. వీరితోపాటు యువత విభాగంలో జే.షారోన్ కృపాకర్, డాక్టర్ జి.హారిక, మ్యాథ్యూలు ఎన్నికయ్యారు. వీరితోపాటు నలుగురు జనరల్ కేటగిరీలోనూ, ముగ్గురు మహిళా కేటగిరిలోనూ, మరోముగ్గురు యూత్ కేటగిరీలోనూ ఎన్నికయ్యారు. పాస్టర్ రెవరెండ్ విక్టర్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారు మూడు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగనున్నారు. వీటితోపాటు జనరల్ కేటగిరీలో డి.దేవశిఖామణి, ఎస్.డేవిడ్ ఇమ్మానియల్, కిస్సీ వాట్కిన్స్‌లు ఎంపిక కాగా, టి.పంకజ రవికుమార్, కె.రాణి వివేకం, ఎం.జ్యోతి మహిళా కేటగిరీలో ఎన్నికయ్యారు. ఇ.ఎస్తేర్ రూబి వేదం, పి.జాకోబ్ శ్యామేల్, డీసీ పవిత్రలను యూత్ కేటగిరీలో ఎన్నుకోగా, వీరిలో ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చి పాస్టర్‌గా రెవరెండ్ పీఎస్ స్వరూప్‌లను ప్రకటించారు.

యోగాపై వ్యాసరచన పోటీలు

కడప కల్చరల్ : జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని విశ్వాత్మ పిరమిడ్ యోగా రీసెర్చి సెంటర్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జీవీఎస్ రెడ్డి తెలిపారు. జూన్ 6వ తేదీలోపు వ్యాసరచన పోటీ కోసం రచనలు పంపాలని డాక్టర్ డి.ఊర్మిలాదేవి సూచించారు. వ్యాసరచనతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు అభ్యర్థులు ఈ చిరునామాకు పంపాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను కూడా బహూకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8074826819 నెంబరులో సంప్రదించాలన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు తీర్మానం చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

ప్రొద్దుటూరు : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మహానాడులో తీర్మానం చేయాలని ఇండియా బ్లాక్‌గా మహానాడులో సీఎంకు ఈనెల 29న తీర్మానపు మెమొరాండం ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు అధ్యక్షతన మంగళవారం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమకు ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేశారే కానీ ఒక్క ఇటుక పేర్చలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఏపీ అంటే అమరావతి, పోలవరం అంటున్నారే తప్ప ఇతర జిల్లాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నా దానిని ప్రస్తావించకపోవడం సరైనది కాదన్నారు. మహానాడులో కడప ఉక్కు పరిశ్రమపై తీర్మానం ప్రవేశపెట్టి అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఈ చుట్టు పక్కల ఉన్న ప్రాంతాల్లో విద్యా, వ్యాపార వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతాయన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు 29 ఏళ్లు అయినా అరటీఎంసీ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రాజోలి నిర్మాణంపై సీఎం చంద్రబాబుతో తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు. విరసం పూర్వ రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ కడప జిల్లా పట్ల ఏ ప్రభుత్వం వచ్చినా చిత్త శుద్ధి లేకుండా అధికారం కోసం చేసిన హామీలు వాగ్దానాలుగానే మిగిలిపోతున్నాయన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తే సామాజికంగా, రాజకీయంగా ప్రజలు చైతన్యవంతమవుతారని భావించి ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరియా ఇన్‌చార్జి నజీర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు వేల ఎకరాలు ఉక్కు పరిశ్రమకు తీసుకోవడం, కార్పొరేట్ కంపెనీలను పిలిపించడం పత్రికల్లో రావడం తప్ప ఆచరణలో ఉక్కు పరిశ్రమను నిర్మించడం లేదన్నారు. ఇస్లామిక్ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మొయిద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తుల అమ్మకాల పట్ల ఉన్న శ్రద్ధ పాలకులకు నూతన పరిశ్రమలు స్థాపించడం పట్ల లేదన్నారు. సమావేశంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఏరియా కన్వీనర్ సలీం బాష, సీపీఐ నాయకుడు శివారెడ్డి, చేనేత సంఘం నాయకులు రామకృష్ణ, వద్ది సుబ్బన్న, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షు డు వై.హరి, ఏఐటీయూసీ నాయకులు నరసింహా, ఎంపీజే నాయకుడు అజ్మతుల్లా, భవన నిర్మాణ కా ర్మిక సంఘం నాయకులు యేసోబ్, మద్దిలేటి, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు ప్రమీల, సుజాత, ఏఐవైఎఫ్ నాయకులు జహీర్, సురేష్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మౌనిష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



2021లో గండిపడిన టిసంద్రపల్లె చెరువు కట్ట (ఫైల్)

గోపవరం : గండిపడిన టి.సంద్రపల్లె చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 2021 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్టకు గండి పడింది. అయితే అప్పట్లో యుద్ధప్రాతిపదికన కట్ట తెగిన చోట తాత్కాలిక రింగ్‌బండ్ వేశారు. మండలంలో రాచ్చెరువు తర్వాత టి.సంద్రపల్లె చెరువు ఎక్కువ ఆయకట్టు కలిగి ఉంది. చెరువు కట్టకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రతి ఏటా కురిసే వర్షాలకు తాత్కాలిక రింగ్‌బండ్ వలన ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల సీజన్ ప్రారంభమవుతుండటంతో చెరువుకు సమృద్ధిగా నీరు వస్తే రింగ్‌బండ్ వలన మరోసారి చెరువుకు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపతికన రింగ్‌బండ్ స్థానంలో శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే గాని పంట చేతికొచ్చే అవకాశం లేదు. పూర్తిస్థాయిలో చెరువులోకి నీరు చేరితే రింగ్‌బండ్ నిలబడే అవకాశం లేదని, యుద్ధప్రాతిపదికన కట్టకు గండి పడిన చోట శాశ్వత పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేనేత స్టాళ్ల ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలో టీడీపీ మహానాడు మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు 11 స్టాళ్లను మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సందర్శించారు. ప్రతి స్టాల్ దగ్గరికి వెళ్లి... ఏయే ప్రాంతం నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు. వస్త్రాల నాణ్యత, తయారీ గురించి ఆరా తీశారు. చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను, అమలు చేస్తున్న పథకాల గురించి నేతన్నలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె రూ.10 వేల విలువ చేసే చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. తనతో పాటు వచ్చిన అనుచరులతోనూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయించారు. అనంతరం అక్కడే డ్వాక్రా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఫుడ్, ఇతర స్టాళ్లను కూడా మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



బి.కోడూరు: యోగాసనాలు వేస్తున్న అధికారులు

మైదుకూరు : యోగాతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి సూచనతో అధ్యాపకులు, విద్యార్థులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ ఎం.రాధారామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో యోగా ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా, మెడిటేషన్ చేసి ఆరోగ్యవంతులుగా మారాలని సూచించారు.

యోగాపై శిక్షణ

బి.కోడూరు : మండలంలో జూన్ 21 వరకు నిర్వహించనున్న యోగాపై మండల కేంద్రమైన బి.కోడూరులో మంగళవారం మండల స్థాయి సిబ్బందికి ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. పది సచివాలయాల పరిధిలోని ఒక సచివాలయానికి 9 మంది చొప్పున 90 మందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో యోగా వలన కలిగే ప్రయోజనాల గురించి, ప్రస్తుతం మారిన ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో యోగా వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం, ఏపీఓ, వెలుగు, ఉపాధి, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం అని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం నగరంలోని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ×చట్టం ఎవరికి చుట్టం? అనే ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింల ఐక్యతను దెబ్బతీయడం కోసం అయోధ్య సమస్య తీసుకురావటం, 370 రద్దు చేయడం, త్రిబుల్ తలాక్ అంశాన్ని తీసుకురావటం, హిజాబ్ అంశాన్ని తీసుకురావటం వెనుక ఒక మత రాజకీయ పార్టీ చేస్తున్న కుట్ర తప్ప వేరేది ఏమీ లేదన్నారు. అందుకని వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం? అనే పుస్తకాన్ని అత్యధికంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్ అలీ, మత గురువు అక్బర్ అలీ రసాది, వక్ఫ్ బోర్డు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్, నగర కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, కో కన్వీనర్స్ షేక్ మక్బూల్ బాషా బహుద్దీన్ హిధాయతుల్లా షబ్బీర్, ఆబిద్ హుస్సేన్ అబ్దుల్ సత్తార్, జాబీర్ అలీ ఖాన్, జిలాని జమాయితో ఇస్లామిక్ హింద్ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా, నాయకులు షాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వి.రాజుపాళెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

14 మందిపై కేసు నమోదు, ఒకరు కర్నూలు తరలింపు

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామంలో మంగళవారం ఉదయం 10గంటల ప్రాంతంలో పల్లెం శ్రీనివాసులు, నలసింగ్ కుళ్లాయప్ప వర్గీయుల నడుమ భూ తగాధా విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారు కర్రలు, రాడ్లు, కత్తులతో దాడు చేసుకున్నారు. ఈ ఘర్షణలో గాయపడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్ర గాయాలైన పవన్ అనే వ్యక్తిని కర్నూలుకు తరలించగా, కృష్ణయ్య అనే వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. ఘర్షణ పడ్డ ఇరువర్గాలకు చెందిన 14 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మెగా బైబిల్ ఎగ్జిబిషన్ అండ్ సేల్



ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను ప్రారంభిస్తున్న దైవ సేవకులు టీడీ ప్రసన్నకుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం రాజారెడ్డివీధిలోని కృపా చర్చిలో మంగళవారం మెగా బైబిల్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను దైవ సేవకులు, చర్చి వ్యవస్థాపకులు టీడీ ప్రసన్నకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో 50 రకాల బైబిల్స్ వివిధ సైజుల్లో ఉన్నాయన్నారు. ఈనెల 29వ తేదీ వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో బైబిల్ నిఘంటువులు, బైబిల్ కవర్లు, గిఫ్ట్ ఆర్టికల్స్, వివిధ రచయితల పుస్తకాలు, ఇతర వస్తు సామాగ్రి అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు రవికుమార్, సుభాషిణి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వైవీ డేవిడ్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నాయీ బ్రాహ్మణ సంక్షేమ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పడమటి అంజనేయస్వామి ఆలయంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కనకరావు ఆదేశాల మేరకు మంగళవారం పులివెందుల నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పులివెందుల అధ్యక్షుడిగా పట్నం రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా బోనాల మహేష్, జనరల్ సెక్రటరీగా బూచుపాటి సంజీవులు, జాయింట్ సెక్రటరీలుగా శంకర్, అంజి, ట్రెజరర్‌గా మురళి, ప్రధాన కార్యదర్శులుగా శ్రీధర్, విజయ్, లోకేష్, శ్రీను, పవన్, రాజశేఖర్, సలహాదారులుగా దంతలూరు మునెయ్య, గండికోట కొండయ్య, చింతకుంట్ల హరికృష్ణ, నల్లపురెడ్డిపల్లె అంజి, రామకృష్ణ, కామసముద్రం కుళ్లాయప్ప, రాము, పాలగిరి రవిశంకర్, పసుపులేటి గోపాల్, తదితరులు ఎన్నుకున్నారు. ఎన్నికైన వీరిని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, రసూల్, చంద్రమౌళి తదితరులు అభినందనలు తెలిపారు.

మూగజీవాలకు పింఛనర్ల ఆసరా





వానరాలకు అరటి పండ్లను అందిస్తున్న పింఛనర్లు జయరామిరెడ్డి, రఘునాథరెడ్డిలు

సింహాద్రిపురం : ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల డబ్బులతో ఇద్దరు వ్యక్తులు మూగజీవాల ఆకలి తీరుస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వారికి వచ్చే డబ్బులు వానరుల గుంపుకు ఆహారం అందించి వాటి ఆకలిని తీరుస్తున్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంకు చెందిన జయరామిరెడ్డి, రఘునాథరెడ్డిలు వారికి వచ్చే పింఛన్ డబ్బులతో వానరాలకు ఆహారం అందిస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. ప్రతిరోజు వారు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, అలాగే మసీదు, టవర్ వద్ద ప్రతిరోజు సాయంత్రం అయ్యేసరికి వానరాలకు కావలసిన ఆహారం తీసుకెళ్లి అందిస్తూనే ఉన్నారు. సమయానికి కోతులు కూడా వారి చెంతకు చేరుతాయి. ఇలా 8 ఏళ్ల నుంచి వీరు కోతులకు ఆహారం అందిస్తున్నారు. ఇది కాక జయరామిరెడ్డి ప్రతిరోజు పొలాల గట్టుల వెంబడి పక్షులకు గింజలు చల్లి వస్తూ ఉంటాడు. ప్రతినిత్యం ఈ చర్య చేయనిదే ఆయనకు నిద్ర పట్టదు. అలాగే అరటిపండ్ల వ్యాపారస్తులు కూడా వీరికి లాభం లేకుండానే అరటిపండ్లను అందిస్తారు. అలాగే దాతలు వీరికి సహాయ సహకారాలు అందిస్తే మూగ జీవులకు ఆహారం అందించిన వారవుతారు. అలాగే వారికి కూడా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

ఉత్సాహంగా జిరాఫీ చెస్ పోటీలు



విన్నర్ శ్రీవిద్య, రన్నర్ సంతోష్‌తో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం జరిగిన జిరాఫీ చెస్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొంటున్న 50 మంది విద్యార్థుల మధ్య జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జీవన జ్యోతి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కాటం శ్రీవిద్య విన్నర్‌గా, సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సన్యాసిగారి సంతోష్ రన్నర్‌గా నిలిచారని గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ తెలిపారు. విజేతలకు వేసవి సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకల్లో బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు నాగార్జున, అరవింద్, స్పోకెన్ ఇంగ్లీషు మాస్టర్ రమ్‌తుబేగం పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గెద్దం రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని అనేక మార్లు విద్యాశాఖాధికారులకు వినతి పత్రాలు అందించినా నేటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆయన పేర్కొన్నారు. జీఓ ఎంఎస్ నంబర్ 1 ప్రకారం ప్రైవేటు టీచర్లకు జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, సెలవులు ఇవ్వాలని వివరించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అన్ని పాఠశాలల్లో జీఓ ఎంఎస్ నంబర్ 1ని అమలు చేసేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. మంగళవారం వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు నేతృత్వంలో రూపొందించిన ప్రశ్నాపత్రంతో నిర్వహించబోయే మోడల్ డీఎస్సీ పరీక్షను డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో ప్రభుత్వం నిర్వహించబోయే పరీక్షకు ముందస్తుగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ పరీక్ష అభ్యర్థుల్లో అవగాహన పెంచడంతో పాటు భయాన్ని పోగొట్టేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. బద్వేలు పట్టణంలో గౌతమ్ జూనియర్ కళాశాలలో మోడల్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు రూ.50లు పరీక్ష ఫీజు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉదయం 9:30 గంటల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. వివరాలకు 8247236311, 77995 06227లను సంప్రదించాలని తెలిపారు. ఈ మోడల్ పరీక్ష కేవలం ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమే అని గమనించాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో 2008–09 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల కీర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లి పూర్వ వైభవం పొందేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలలో వారి జ్ఞాపకాలను మిత్రులతో పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువా కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, బీజేపీ జిల్లా నాయకుడు ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు గుంటమయ్య, సాదక్ బాషా, వెంకటయ్య, అమీర్, రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద అనుచరులపై సర్పంచ్ కక్ష సాధింపు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అమృతానగర్ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

ప్రొద్దుటూరు రూరల్ : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి నేతృత్వంలో పనిచేసే టీడీపీ కార్యకర్తలపై సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని అమృతానగర్ టీడీపీ నాయకుడు, 232 పోలింగ్ కేంద్రం టీడీపీ కన్వీనర్ చెన్నూరు నిజాం ఆవేదన వ్యక్తం చేశాడు. సర్పంచ్, సర్పంచ్ అనుచరులు నిజమైన ఇళ్ల స్థలాల లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా ఏళ్లుగా తామంతా టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇప్పుడు సర్పంచ్ వచ్చి తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. అమృతానగర్‌లో ఓబులేసు అనే వ్యక్తిని నియమించి అక్రమ దందాలకు పాల్పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు కూడా పేదల ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతుల కోసం వెళితే వేల రూపాయలు మామూళ్లు తీసుకోవడం సరికాదన్నారు. సోమవారం సర్పంచ్ అనుచరులు జేసీబీ ద్వారా పేదల ఇళ్ల స్థలాల్లో అక్రమంగా పునాదులు తీస్తే తహసీల్దార్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సర్పంచ్, ఆయన అనుచరులు చేసే దందాలపైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి, ఆయన తనయుడు కొండారెడ్డికి, జాయింట్ కలెక్టర్‌కు, కలెక్టర్ ఫిర్యాదు చేస్తానన్నారు. టీడీపీ మహిళా నాయకురాలు పద్మావతి మాట్లాడుతూ తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి టీడీపీ అభిమాని అని, సర్పంచ్‌కు టీడీపీలో స్థానం ఇచ్చినప్పటి నుంచి మాపై కక్షసాధింపు చర్యలు చేపట్టి పార్టీకి దూరం చేస్తున్నారన్నారు. తన స్థలాన్ని కబ్జా చేసేందుకు తనపై లేనిపోని నిందలు, ఫిర్యాదులు చేయడం సర్పంచ్‌కు తగదన్నారు. రెవెన్యూ అధికారులు విచారించి నిజమైన లబ్ధిదారులు ఎవరో గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమృతానగర్ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు గోపాల ప్రసాద్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంట పరిశీలన



దెబ్బతిన్న అరటి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లెలో రైతు వాసుదేవరెడ్డి గత ఏడాది కిసాన్ అగ్రి బయోటెక్ కంపెనీకి చెందిన 5 వేల అరటి మొక్కలను 4 ఎకరాల విస్తీర్ణంలో నాటుకున్నారు. అరటి గెలలు ఆలస్యంగా రావడం, కొన్ని చెట్లు గెలలు వేయకపోగా తోటలో చెట్లన్ని వేరు వ్యవస్థ సరిగా లేకపోవడం, 5వ నెల నుంచే అరటి చెట్లన్ని పడిపోయాయి. 6వ నెలలో రావాల్సిన పూతలు 9 నెలలు గడిచినప్పటికి రాలేదు. అరటి మొక్కలు నాటి ఏడాది పూర్తయినప్పటికి అరటి గెలలు కోతకు రాలేదు. మంగళవారం మహానంది ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త స్నేహలతలు దెబ్బతిన్న అరటి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న అరటి చెట్లను ల్యాబ్‌లో పరీక్షించి తదుపరి నివేదిక రాగానే కంపెనీ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టు వీలర్స్ మెకానికల్స్‌కు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ది టూ వీలర్ మెకానిక్ వర్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దాయినేని ధర్మ కోరారు. మంగళవారం కడప నగరంలోని మున్సిపల్ మెయిన్ హై స్కూల్ ఎదురుగా ఉన్న శివ మెకానిక్ షాపులో ఆయన మెకానిక్స్‌తో కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దాయినేని ధర్మ మాట్లాడుతూ మన రాష్ట్రంలో దాదాపుగా 8 లక్షల మంది మెకానిక్స్ అండ్ వర్కర్స్ ఉన్నారన్నారు. వారిని అసంఘటిత కార్మికులుగా చేర్చాలని ప్రత్యేక కార్పొరేషన్ బోర్డును ఏర్పాటు చేసి వాటిల్లో కార్మికులకు స్కిల్ నైపుణ్య శిక్షణ ఇప్పించాలని కోరారు. నగర అధ్యక్షుడు మహబూబ్ బాషా పాల్గొన్నారు.